
వసుంధర
A.S. Murty

మేము ప్రారంభించిన "జవాబు" పత్రిక చాలా హిట్టయింది! ఒక్క సంవత్సరంలోనే దాని సర్క్యులేషన్ యాభై వేలు దాటింది. రచనలు చదవడానికి మొత్తం ముగ్గురున్నారు. వచ్చిన ప్రతి రచనా ఆ ముగ్గురూ విడి విడిగా చదివి తమ అభిప్రాయా లను తెలియజేశాక దాన్ని బట్టి ఆపై నిర్ణయం నేను తీసుకొనే వాణ్ణి. అన్నింటికీ మించి ఉత్త రాలు శీర్షిక విషయమై నేను మిగుల శ్రద్ధ తీసుకొనే వాణ్ణి.

పాఠకుల నాడి తెలిసేది ఉత్తరాల్లోనే కదా! అందువల్ల వచ్చిన ప్రతీ ఉత్తరాన్ని శ్రద్ధగా చదివి పాఠకుల అభిప్రాయాలకూ, సూచనలకూ ప్రత్యేకమైన విలువ నిచ్చే విధంగా నోట్సు తయారు చేసేవాడిని. ముఖ్యమైన ఉత్తరాలు కొన్ని ప్రచురించి వాటితోపాటు ఉత్తరాల సారాంశం అంటూ మొత్తం ఆ నెల వచ్చిన ఉత్తరా లన్నింటిలోనూ ఉండే ముఖ్యమైన పాయింట్సు ప్రచురించే వాడిని. ఒక సంవత్సరం గడిచేసరికి పత్రిక విషయంలో నేను తీసు కున్న నిర్ణయాలన్నీ బాగున్నవనీ, ఒక్క ఉత్తరాల విషయంలోనే నేను సమయం వృధాచేస్తున్నాననీ అనిపించింది. ఎందుకంటే పాఠకుల ఉత్తరాలన్నీ మూసలో పోసినట్లు ఒకేరకంగా ఉండేవి. ఒక రచన చదివి హృదయం స్పందించిగానీ, పత్రిక బాగోగు లను దృష్టిలో ఉంచుకుని గానీ ఉత్తరాలు రాసేవారి సంఖ్య బహు స్వల్పం. అచ్చులో తమ పేరు చూసుకోవాలనో, లేక యథా లాపంగానో రాసేవారే ఎక్కువగా నాకు కనిపించారు.

అదీగాక ప్రయాణాల్లోనూ, ఇతరత్రానూ కూడా నేను ఫలానా అని చెప్పకుండా ఎంతో మంది పాఠకులతో 'జవాబు' పత్రిక గురించి చర్చించాను. ఒక్క చర్చలో వచ్చిన సూచనలు, అభి ప్రాయాలు చూచుకుంటే- ఏడాది పొడుగునా వచ్చిన ఉత్తరాలకంటే అవి ఎక్కువేననిపించింది. వార ఫలాల శీర్షిక వలెనే ఉత్తరాల శీర్షికనెవరూ సీరియస్‌గా తీసుకో రనీ, అయితే పత్రిక రాగానే చాలామంది వారఫలాలు చూపి నట్లే- ఎందరో ఉత్తరాల శీర్షికను చదువుతారని కూడా నాకు త్వరగానే అర్థమయింది.

అందుకని పత్రికలో రెండు నెలలు తర్వాత ఓ చిన్నప్రయోగం చేశాను. మచ్చుకు ఏవో నాలుగైదు

ఉత్తరాలు ఏరి ప్రచురించి ఆపైన మిగతా ఉత్తరాలన్నీ చదవకుండానే పత్రికలో నేను తీసుకురావాలనుకునే మార్పులన్నింటినీ పాఠకుల అభిప్రాయాలగానూ, సూచనలుగానూ, ఉత్తరాల శీర్షికలో ప్రచురించాను. అలా నాలుగైదు నెలలు చేశాక నాకు అర్థమయింది-పాఠకుల ఉత్తరాల పేరు చెప్పి సంవత్సర కాలం నేను ఎంత సమయం వృథా చేశానో! ఆ తర్వాత ఈ ఉత్తరాల బాధ్యత నేను వదిలిపెట్టి మా సబ్ ఎడిటర్ సూర్యానికి అప్పజెప్పి "ప్రతీనెలా అయిదారుకు తగ్గకుండా, పదికి మించకుండా ఉత్తరాలను ఎన్నిక చేసి ప్రచురిస్తూండు! వాటిలో పత్రికను మెచ్చుకునేవి ఎక్కువ ఉండాలి. విమర్శించేది కనీసం ఒక్కటైనా ఉండాలి!" అని చెప్పాను.

సూర్యానికే ఈ పని అప్పజెప్పడానికో కారణముంది. అతను సమర్థుడు, తెలివైనవాడు. కాని కాస్త నిర్లక్ష్యం. ఉత్తరాల పని అతడి కిష్టపూర్తిగా అప్పజెప్పాను.

ఈ విధంగా మూడు నెలలు గడిచేక ఒకరోజున ఒక అభిమాన పాఠకుడు నన్ను కలుసుకునేందుకు వచ్చాడు.

అతడు కాస్సేపు అవీ యివీ మాట్లాడి—"నాకెంతో అభిమానపాత్రమైన మీ పత్రిక, ఇటీవల కొంత నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోంది. ఇది పత్రికకు క్షేమం కాదు" అన్నాడు.

నేను కంగారుపడి "నిర్లక్ష్య వైఖరి అంటే ఏయే విషయాల్లో?" అనడిగాను.

"ఉదాహరణకు 'ఈ మన్ను తిన్న పాము' కథ చూడండి. అది ఇటీవలే తెలుగులోనే వచ్చిన ఓ కథకు మక్కికి మక్కీ కాపీ. పత్రికలకు వచ్చే రచనల ఒరిజినాలిటీ విషయంలో రచయితలదే పూర్తి బాధ్యత అనుకుంటే రచయితకంటె ముందుగా పత్రిక్కే చెడ్డపేరు వస్తుంది. మీరు, మీస్టాఫ్ కలిసి కనీసం తెలుగులో వస్తున్న సమకాలీన పత్రికలన్నీ చూస్తూండాలి!" అన్నాడు ఆ పాఠకుడు.

"ఉండండి మా సబ్ ఎడిటర్ని పిలుస్తాను. ఈ పొరపాటెందుకు జరిగిందో" అన్నాను.

"ఉండండి. ఇంతటితో కాలేదు ఈ సంచిక చూడండి...." అంటూ అతను ఓ 'జవాబు' సంచిక చూపించాడు. అతను చూపించిన పేజీలో రెండు ఫోటోలున్నాయి. అక్కడ ఇలా వ్రాసి ఉంది. "ఈ

రచయితల వివరాలు గత సంచికలో ప్రచురించాం. కారణాంతరాలవలన ఫోటోలు ఆ సంచికలో ప్రచురించలేకపోయాం. ఇప్పుడు రచయితలఫోటోలుఇక్కడ ప్రచురిస్తున్నాం" అక్కడ ఒక ఆడ, మగ ఇద్దరి ఫోటోలున్నాయి. మగ ఫోటో క్రింద సరోజ అని వ్రాసి వుంది. ఆడ ఫోటో క్రింద రామారావు అని వ్రాసి ఉంది.

"విషయం మా సబ్ ఎడిటర్ గమనించాడో లేదో కనుక్కుంటాను" అన్నాను. కానీ మనసులో నాకంత తృప్తిగా లేదు. ఎంతో శ్రద్ధగా నిర్వహిస్తున్న మా పత్రికలో ఈ నిర్లక్ష్యమేమిటి? ఇదే కొనసాగితే పత్రిక ప్రిస్టేజ్ ఏమైపోతుంది?

"పత్రికకు సంబంధించి అన్నీ సబ్ ఎడిటర్లే చూస్తుంటారా?" అనడిగాడు పాఠకుడు,

"అదేమీలేదు. పత్రిక రూపు రేఖలు, ఫినిషింగ్ టచెస్ నావి. మిగతా శ్రమంతా వాళ్ళది!"

"అఫ్‌కోర్స్- సంపాదకుడి బాధ్యతలవే! పత్రిక గొప్పతనమంతా వీటిమీదే ఆధారపడి వున్నది. అంతమాత్రాన పత్రికలో దొర్లే అచ్చుతప్పులు, చిన్న చిన్న పొరపాట్లు మీ బాధ్యత కాకుండా పోదు" అన్నాడు పాఠకుడు.

"నేను బాధ్యతను ఇతరుల మీదకునెట్టి వేయడం లేదు. పొరపాటెలా జరిగిందో తెలుసుకుందుకు ప్రయత్నిస్తున్నాను."

"ఉండండి ఈ పత్రికచూడండి" అంటూ అతను ఓ పత్రిక ఇచ్చి ఓ వ్యాసం చూపించాడు. ఆ వ్యాసంలో ఇండియాలో క్రికెట్ ఆట గురించి వివరించబడింది. నాకు క్రికెట్ గురించి అట్టే తెలియదు. క్రికెట్ గురించి అలాంటి వ్యాసం వేసిన గుర్తు కూడా లేదు నాకు. అతడిముందు ఆ విషయం తేలడం ఇష్టంలేకపోయింది. ఇంతకీ అతడు చెప్పేదేమిటంటే, ఆ వ్యాసంలో చాలా తప్పుడు సమాచారముంది!

అసలు నాకు తెలియకుండా ఈ వ్యాసం ఎలా ప్రచురించబడింది?

నేను వెంటనే సబ్ ఎడిటర్ని పిలిచాను. మన్ను తిన్న పాము గురించి వచ్చిన అభియోగంలో కథ విషయమై అడిగిన అతడు "ఉండండి సార్! ఈ కథని వీరు 'జవాబు' సెప్టెంబర్ సంచికలో కదా వచ్చిందని రాశారు. 'జవాబు' పత్రిక ప్రతులు యిప్పుడే తెస్తాను" అంటూ వెళ్ళాడు. జవాబు సెప్టెంబర్ సంచిక తీసుకుని వచ్చాడు. సబ్ ఎడిటర్ ముఖంలో పెద్ద వెలుగు ఉంది,

"ఆ అభియోగం సరైనది కాదు సార్! ఇందులో ఆ కథ లేదు" అన్నాడు.

నేను, ఆ తర్వాత పాఠకుడు ఆత్రుతగా ఆ పుస్తకం చూశాం. అందులో ఎక్కడా ఆ కథ లేదు.

నేను మరుగ్గా పాఠకుని వంక చూశాను. అతడి ముఖం పాలి పోయింది- "సరే-నా రెండవ అభియోగం సంగతి తేల్చండి" అన్నాడతను వెంటనే తడుముకో కుండా.

సబ్ ఎడిటర్ వెంటనే నవ్వేసి "మీకు గుర్తులేదా సార్! మన మేమీ పొరపాటు చెయ్యలేదు. సరోజ అన్నది ఆ రచయిత కలం పేరు. రామారావు అన్నది ఆ రచయిత్రి కలంపేరు. మన పత్రిక రెగ్యులర్ రీడర్స్ చాలా మందికి ఆ విషయం తెలుసు!" అన్నాడు మావాడు.

నాకు కలిగిన ఉత్సాహమింతా అంతా కాదు. ఈ రెండు విజయాల అనంతరం, పాఠకుడి మూడో అభి యోగం కూడా తప్పే అయుంటుం దని నాకు తోచింది. ఆ వ్యాసంలో క్రికెట్ గురించి ఇచ్చిన సమా చారం సరైనదే అయుండాలి.

సబ్ ఎడిటర్ మూడో అభి యోగం గురించి విని, "మన పత్రికలో క్రికెట్ గురించి వ్యాస మేమీ వేయలేదే?" అన్నాడు.

"వేసిన గుర్తు నాకూ లేదు. కానీ వీరి వద్ద ఉన్న పుస్తకంలో ఆ వ్యాసముంది" అన్నాను.

సబ్ ఎడిటర్ దానివైపు పరీక్షగా చూసి, "ఉండండి సార్. ఈ కాపీ మన దగ్గరున్నది కూడా తెస్తాను" అంటూ లోపలకు వెళ్ళి సదరు పత్రిక కాపీ తెచ్చాడు. అందులో ఆ వ్యాసం లేదు.

"చూడండి సార్! విషయ సూచికలో ఇది లేదు. అయితే ఈ పుస్తకంలో ఇదెలా వచ్చింది? ఈ వ్యాసం మన పత్రికది కాదు. తెలివిగా దీన్నిందులో అతికించి ఉండాలి!" అన్నాడతను. పరీక్షించి చూడగా అది నిజమేనని తేలింది. మరో మాస పత్రికలో వచ్చిన ఆ వ్యాసాన్ని ఇందులో పెట్టి తెలివిగా పిన్ చేయడం జరిగింది.

"మిస్టర్ మీరు చేసిన ఈ అభి యోగాలన్నీ తప్పు. మా పత్రిక ఎంతో శ్రద్ధగా నిర్వహించబడు తోంది. మేము అన్ని విషయా ల్లోనూ ఎన్నో జాగ్రత్తలు తీసు కుంటూంటాం. మీరు అనవస రంగా నా కాలాన్ని వృధా చేశారు" అన్నాను.

ఆయన ముఖంలో పట్టుబడ్డా

నన్న విచారం లేదు. అతడు నా వంకా సబ్ ఎడిటర్‌వంకా చూసి, "మీ పత్రిక ఎలా నిర్వహించబడు తోందో తెలుసుకుందామని వచ్చాను సార్! ఇలా ఇన్ని జాగ్రత్తలు తీసుకునే పత్రికలు తెలుగులోనే అరుదు సార్! మిమ్మల్ని అభినంది స్తున్నాను" అన్నాడు.

"మీ పరీక్షలు తీరుబడిగా ఉన్న వారిమీద చేయండి. మా కాలం ఎంతో విలువైనది. పాఠకులనుండి నిర్మాణాత్మకమైన సూచనలు, చర్చలు మేమెప్పుడూ ఆహ్వా నిస్తూంటాం! కానీ ఇలాంటివి మాత్రం సహించం?" అన్నాను.

అతడు చటుక్కున లేచి నిల బడి, "ఇంకా మీ పత్రిక నిర్ల క్ష్యంగా నడుస్తున్నదని మీకర్థం గాకపోవడంవలన మీరు నామీద చిరాకు పడుతున్నారు. ఇది నాకెంతో విచారంగా వున్నది!" అన్నాడు.

"ఏమిటి మిస్టర్! మరో తప్పుడు అభియోగం చేస్తున్నారు?" అన్నాను తీవ్రంగా.

"నా అభియోగాలు తప్పుడువని అంత ఖచ్చితంగా మీరు చెప్ప గలిగినప్పుడు, ఆ అభియోగాలతో నేను వ్రాసిన ఉత్తరాన్ని ఉత్తరాల శీర్షికలో ఎందుకు ప్రచురించారు?" అన్నాడు ఆయన.

నేను ఉలిక్కిపడ్డాను. సంచిక వివరాలడిగిమాసబ్ ఎడిటర్ లోపలకు పరుగెత్తాడు. అతడు తీసుకువచ్చిన సంచికలో ఎనిమిది ఉత్తరాలు వున్నాయి. ఏడుత్తరాలు పత్రికకు ప్రశంస అందజేశాయి. ఒకే ఒక ఉత్తరం పత్రికను విమర్శించింది. అది ఈ పాఠకుడి ఉత్తరం. ఇప్పు డతను మా ముందుంచిన అభి యోగాలే ఆ ఉత్తరంలో వున్నాయి.

"వస్తాను సార్! ఇలాంటి ఉత్తరాలు నేను చాలా పత్రికలకు రాశాను. మీ పత్రిక ఒక్కటే నా ఉత్తరాల్ని ప్రచురించింది పత్రి కల సిన్సియారిటీని పరీక్షించే హాబీ నాకుంది! మీ పత్రికపై ఉన్న అభి మానంకొద్దీ ఆ పరీక్షా ఫలితం చెప్పడానికి వచ్చాను!"

ఈ పాఠకుడులాంటి వాణ్ణి ఒక్కడ్ని తల్చుకునైనా ఉత్తరాల శీర్షిక విషయంలో జాగ్రత్త తీసు కోకతప్పదని గ్రహించాను నేను. ఆయన తన అభియోగాలు చెప్పిన అలాంటి ఉత్తరం ఒకటి మా పత్రి కలోనే వేశామని గ్రహించక పోవడం ఆయన నాపై ఎటువంటి అభిప్రాయాన్ని కల్గిస్తుందో అను కుంటూ "సబ్ ఎడిటర్! మళ్ళీ మనం సూర్యం డ్యూటీ మార్చాలి!" అన్నాను. ●